క్లుప్తంగా

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం కొత్తకన్నలి గ్రామంలో రాస్ ఆధ్వర్యంలో ప్రసూతి ఆస్పత్రి, శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, అవగాహన సదస్సు నిర్వహించారు. రాస్ సంఘాల మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. డాక్టర్ సునీత మాట్లాడుతూ మహిళల్లో సంభవించే పలు రకాల క్యాన్సర్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు, వైద్యులు లావణ్య, అఖిల, పూజ, దివ్యశ్రీ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

లోక్ అదాలత్‌లో 311 కేసుల పరిష్కారం

సత్యవేడు: సత్యవేడు కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 311 కేసులను పరిష్కరించినట్లు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ తెలిపారు. బాధితులకు రూ.41,76,726 అందజేసినట్లు తెలిపారు. వాటిలో క్రిమినల్ కేసులు 32, ఎంసీ-1, అడ్మిషన్ కేసులు 4, సివిల్ కేసులు 7, ఈపీ 4, బ్యాంకు కేసులు 15, పెట్టీ కేసులు 211 ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ లత, సత్యవేడు, వరదయ్యపాళెం, నాగలాపురం బ్యాంకులు, టెలిఫోన్ సిబ్బంది, పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అదాలత్ తీర్పు.. సుప్రీం తీర్పుతో సమానం



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి: లోక్ అదాలత్ తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని శ్రీకాళహస్తి న్యాయస్థానం 12వ జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని కోర్టు భవనంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఇరువర్గాలు విజేతలేనన్నారు. అనంతరం లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. 337 కేసులకుగాను రూ.82,63,234 రికవరీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి బేబీరాణి, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేద్దాం



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీకాళహస్తి న్యాయస్థానం 12వ జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. కోర్టు ఆవరణలో శనివారం బాల్యవివాహాల నిర్మూలనపై గోడ పత్రికలను ఆవిష్కరించారు. న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ 2004 నుంచి ఎన్నో పోరాటాలను చేస్తూ బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్న బాల్య వివాహ వ్యతిరేక పోరాట సమితి కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చందమామల కోటయ్య, పులి శ్రీకాంత్, మల్లికార్జున్, సుబ్రహ్మణ్యం, వేణు, చెంచురామిరెడ్డి, ఈశ్వరయ్య, గంగయ్య పాల్గొన్నారు.

ప్లకార్డుల ప్రదర్శన

తిరుపతి కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం సొంతంగా డెయిరీ ఏర్పాటుకు సిద్ధమైతే తాను వెయ్యి ఆవులను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని పుంగనూరుకు చెందిన బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ ప్రకటించారని, ఈ మేరకు టీటీడీ పాలక మండలి డెయిరీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవాలని బీసీ సంఘ నేత శ్రీనివాసులు యాదవ్ విజ్ఞప్తి చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీటీడీ సొంత డెయిరీకి చర్యలు తీసుకోవాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ మేరకు రాష్ట్ర సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి లేఖలు ఇచ్చారని తెలిపారు.

వెంగారెడ్డికండ్రిగ పంట పొలాల్లో కోతకు గురైన పంట పొలాలు



అంబూరు వద్ద నీట మునిగిన వరి పంట



చెన్నవారిపాళెం వద్ద మొలకెత్తని వేరుశనగ పంట



సాయం కోసం ఎదురుచూపు

తుపాను ప్రభావంతో వరుసగా భారీ వర్షాలు కురవడంతో పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా ఈ నెలలో రెండుసార్లు వచ్చిన భారీ వర్షాలకు వరి పంట నీట మునిగింది. నారుమడులు కుళ్లిపోయాయి. వేరుశనగ విత్తనాలు మొలకెత్తలేదు. పలుచోట్ల పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. దీంతో రైతులు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయలేదు. ఈ నేపథ్యంలో తుపాను నష్టం నుంచి ఎలా గట్టెక్కాలని రైతులు ఆవేదన చెందుతున్నారు.

– వరదయ్యపాళెం

- పంటలపై తుపాను ప్రభావం
- పలుచోట్ల పొలాల్లో ఇసుక మేటలు
- నీట మునిగిన వరి పంట



కడూరు కూడలి వద్ద పారుతున్న నీటి ప్రవాహం

వరదయ్యపాళెం మండలంలోని సంతవేలూరు, అంబూరు, మరదవాడ, కళత్తూరు, కడూరు ప్రాంతాల్లో వరద ఉద్ధృతికి వరిపంట నీట మునిగింది. రెండు, మూడు రోజులుగా నీటిలోనే ఉండడంతో పైరు పూర్తిగా పాచిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకే నెలలో రెండుసార్లు భారీ వర్షాలు సంభవించడంతో తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. వెయ్యి ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్టు రైతులు చెబుతున్నారు.

ఇసుక మేటలతో ఇబ్బందులు

మండలంలోని వెంగారెడ్డికండ్రిగ, పెద్ద పాండూరు, చెన్నవారిపాళెం ప్రాంతాల్లో వేరుశనగ సాగుకు సిద్ధం చేసిన పొలాలు వర్షపు నీటి ఉద్ధృతికి ఎక్కడికక్కడ కోతకు గురైంది. అంతేగాక ఇసుక మేటలు వేయడంతో సాగుకు పనికిరాకుండా పోయాయి. కోతకు గురైన పొలాలను సరిచేసుకునేందుకు భారీ మొత్తంలో ఖర్చవుతుందని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలం వస్తే ఈ సంఘటనలు తమను నిలువునా నష్టాల్లోకి నెట్టుతున్నాయని వారు వాపోతున్నారు.

మొలకెత్తని వేరుశనగ

భారీ వర్షాలకు మండలంలోని చెన్నవారిపాళెం, పెద్ద పాండూరు, తొండంబట్టు ప్రాంతాల్లో 3 రోజుల క్రితం సాగుచేసిన వేరుశనగ పంట మొలకెత్తలేదు. విత్తనం కుళ్లిపోయినట్లు రైతులు చెబుతున్నారు. భారీ పెట్టుబడితో సాగు చేసిన పంట దెబ్బతినడంతో భారీ నష్టాన్ని మిగిల్చిందని వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాక్షికంగా దెబ్బతిన్న 17 పూరిళ్లు

పూరిళ్లలో నివాసమున్న పలువురు పేదలకు భారీ వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. మండలంలోని పలు గ్రామాల్లో 17 పూరిళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తహసీల్దార్ రాజశేఖర్ తెలిపారు. ఈ వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదించామన్నారు.

ఎటు చూసినా జలమయమే..!

వరదయ్యపాళెం: రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలు మండలంలో ఎటుచూసినా జలమయమైంది. వరదనీటి ప్రవాహంతో అతలాకుతలమైంది. మండలంలోని పలు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. జనజీవనం స్తంభించింది.

జల దిగ్బంధంలో పలు గ్రామాలు

మండలంలోని సంతవేలూరు, అంబూరు, మరదవాడ, మరదవాడలోని దిగువ హరిజనవాడ, బీజీఆర్‌కాలనీ, పల్లపుతాగేలి జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ గ్రామాల చుట్టూ పెద్దఎత్తున వరద నీరు చేరడంతో పూర్తిగా జలమయమయ్యాయి. ఇళ్లలోకి సైతం నీరు రావడంతో స్థానికులు ఆందోళన చెందారు. విద్యుత్ సరఫరా లేని కారణంగా మంచి నీటికి కూడా ఇబ్బందులు పడుతున్నారు.

స్తంభించిన రాకపోకలు

వర్షాల కారణంగా పెద్ద పాండూరు సమీపంలోని రాళ్లకాలువ, సంతవేలూరు మార్గంలోని పాముల కాలువ, పులిబొంద ఉధృతంగా ప్రవహించడంతో ఈ రెండు మార్గాల్లో 15 గ్రామాలకు పైగా రాకపోకలు స్తంభించాయి. ఈ గ్రామాల నుంచి కార్మికులు సైతం పరిశ్రమలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పూర్తిగా జనజీవనం స్తంభించడంతో కనీస అవసరాలకు కూడా అవస్థలు పడ్డారు.

పాక్షికంగా దెబ్బతిన్న 17 పూరిళ్లు

మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో 17 పూరిళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు స్థానిక వీఆర్వోల నుంచి సమాచారం అందిందని, వాటి వివరాలను ప్రభుత్వానికి నివేదించినట్లు తహసీల్దార్ రాజశేఖర్ తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి నష్టాన్ని అంచనా వేస్తామన్నారు.

అనధికార లేఔట్ ప్రహరీగోడ తొలగించండి

వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ మారేడు కాలువ బఫర్ జోన్ పరిధిలో అనధికారిక లేఔట్‌కు నిర్మించిన ప్రహరీగోడను తొలగించాలని కో–ఆప్షన్ సభ్యుడు సిద్ధిక్, తహసీల్దార్‌కు, మేజర్ పంచాయతీ ఈఓకు వినతి పత్రం ఇచ్చారు. ఈ ప్రహరీగోడ వల్ల బీజీఆర్ గిరిజనకాలనీ, లేఔట్‌కు తూర్పు భాగంలో ఉన్న ప్రాంతం జల దిగ్బంధంలో చిక్కుకుంటున్నాయని నివేదించారు. దీని కారణంగా వరదయ్యపాళెం టౌన్‌కు రానున్న రోజుల్లో పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు.

భారీగా పంట నష్టం

సంతవేలూరు, అంబూరు, కళత్తూరు, కడూరు, కాంబాకం ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా పలుచోట్ల వరి పంట నీట మునిగింది. ఎక్కడ చూసినా వరద ఉధృతి అత్యధికంగా ఉండడంతో పొలాలు మొత్తం వర్షపునీటితో చెరువులను తలపిస్తున్నాయి. దాదాపు 700 ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయా ప్రాంతాల్లో స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



పెద్ద పాండూరు ప్రాంతంలో కొట్టుకుపోయిన వేరుశనగ పంట పొలాలు



సంతవేలూరు మార్గంలో దెబ్బతిన్న రోడ్డు



సంతవేలూరు ప్రాంతంలో నీట మునిగిన వరి పంట



నీట మునిగిన బీజీఆర్ కాలనీ



జలమయమైన అంబూరు ప్రాంతం

కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగం

- సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఇతరులు పోటీ చేయకుండా అడ్డగింత

బుచ్చినాయుడుకండ్రిగ : సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా తిరుపతి జిల్లా కో కన్వీనరు వేలూరు రాకేష్ ఆరోపించారు. ఆయన శనివారం బుచ్చినాయుడుకండ్రిగలో జరుగుతున్న సాగునీటి సంఘాల ఎన్నికలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సాగునీటి సంఘాల ఎన్నికలను కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా నిర్వహిస్తోందని విమర్శించారు. అందువల్ల తాము ఎన్నికలను బహిష్కరించిన్నట్టు తెలిపారు. ప్రభుత్వ సూచనలతో జిల్లా అధికారులు కూటమి నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో పాల్గొనేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై దౌర్జన్యాలకు దిగుతున్నారని, అభ్యర్థులకు నీటి పన్నుకు సంబంధించి నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ప్రశ్నించిన నేతలను హౌస్ అరెస్టు చేస్తున్నారని, ఇది కూటమి ప్రభుత్వ దుర్మార్గానికి నిదర్శమన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మణినాయుడు, రవిరెడ్డి, నాయకులు గురవయ్య, ప్రసాద్‌పాల్, సంజీవయ్య, గిరి, అమరలింగయ్య, ప్రసాద్, వెంకటేష్, కిరణ్ యాదవ్, రాజశేఖర్, హేమంత్, మనోహర్, ఆనంద్, శివ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేలూరు రాకేష్

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ



కేక్ కట్ చేస్తున్న వేలూరు రాకేష్

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రమైన బుచ్చినాయుడుకండ్రిగలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం తిరుపతి జిల్లా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ వేలూరు రాకేష్ జన్మదినాన్ని నాయకులు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి నాయకులు, అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మణినాయుడు, రవిరెడ్డి, నాయకులు గురవయ్య, ప్రసాద్‌పాల్, సంజీవయ్య, గిరి, అమరలింగయ్య, ప్రసాద్, వెంకటేష్, కిరణ్‌యాదవ్, రాజశేఖర్, హేమంత్, మనోహర్, ఆనంద్, శివ తదితరులు పాల్గొన్నారు.

13 సాగునీటి సంఘాలకు అధ్యక్షుల ఎన్నిక

సత్యవేడు: మండలంలో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధ్యక్షులుగా 12 మంది టీడీపీ అభ్యర్థులు, ఒకరు జనసేన అభ్యర్థి ఎన్నికయ్యారు. సత్యవేడు పంచాయతీ దళవాయి అగ్రహారం చెరువుకు ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, పుదుకుప్పం చెరువుకు వినాయకం, రాజకుమార్, ఆంబాకం చెరువుకు శివానందం, కోదండన్, మధనంజేరి చెరువుకు పళని, మురళీ, శిరునంబుదూరు పెద్ద చెరువుకు అల్లాస్వామి, అన్‌బనగ్, శిరునంబుదూరు చిన్న చెరువుకు చంద్రశేఖర్, చెల్లయ్య, మదనంబేడు చెరువుకు పార్థసారథి, పరంధామన్, వీఆర్ కండ్రిగ చెరువుకు గోవిందరాజులు, రమేష్, కన్నావరం-జెడేరి చెరువు పి.రాణెమ్మ, సి.పురుషోత్తం, ఓబుళరాజుకండ్రిగ చెరువుకు వరదరాజు గిరిబాబు, సురేష్, పీవీపురం చెరువుకు బుజ్జమ్మ, నాగరత్న, రాజగోపాలపురం చెరువుకు ఎం.మునిరత్నం(జనసేన), చిన్న కాటయ్య, పేరడం చెరువుకు వెంకటేశ్వర్లు, మునస్వామి ఎన్నికయ్యారు. ఎస్ఐ రామస్వామి బందోబస్తు ఏర్పాటు చేశారు.



బుచ్చినాయుడుకండ్రిగ: తిరుపాల్‌ను అభినందిస్తున్న రైతులు

కంచనపుత్తూరు చెరువు అధ్యక్షుడిగా తిరుపాల్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు గ్రామ చెరువు అధ్యక్షుడిగా రైతు పిడుగు తిరుపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనను సర్పంచ్ బట్టా స్వప్న, మాజీ సర్పంచ్ గెడితొట్టి గురవయ్య, నాయకులు చెంచురామయ్య, చెంగయ్య, కృష్ణ, గురునాథం, గంగాధరం, వెంకటేష్, భాస్కరయ్య అభినందించారు. చెరువు అభివృద్ధి కృషి చేస్తానని తిరుపాల్ తెలిపారు.

ప్రశాంతంగా సాగు సంఘాల ఎన్నికలు

నారాయణవనం: మండలంలోని పాలమంగళం నార్త్ చెరువు సాగునీటి సంఘం మినహా ఐదు సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. పాలమంగళం ఉత్తరపు కండ్రిగలో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దదారులకు 200 మంది రైతులు ఓటు వేయగా, టీడీపీ మద్దతుదారులకు 12 మంది మాత్రమే ఓటేశారు. అధ్యక్షుడిగా ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా సుబ్రమణ్యం నాయుడు ఎన్నికయ్యారు. సమష్టి కృషితోనే వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయం సాధించినట్టు సర్పంచ్ సాయిరవి పేర్కొన్నారు.



పాలమంగళం
ఉత్తరపు చెరువు సాగునీటి సంఘం సభ్యులు

వైభవంగా సురాపాళ ఉత్సవం

నారాయణవనం: తమిళ కార్తీక పౌర్ణమి సందర్భంగా పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం సురాపాళ ఉత్సవాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామిని తిరుచ్చిపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తులు తాటాకు మట్టలతో సిద్ధం చేసిన తాల వృక్షానికి సంప్రోక్షణ చేసి పూజలు చేశారు. అనంతరం తాల వృక్షాన్ని అగ్నికి ఆహుతి చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ దేవ దానవులు మధించిన క్షీర సాగరంలో ఉద్భవించిన అమృతాన్ని మహావిష్ణువు మోహినీ అవతారమెత్తి దేవతలకు పంచి పెట్టారని తెలిపారు. దేవతలు తిరిగి వెళుతూ స్వర్గ ద్వారాన్ని పూజించి సంబరాలు జరుపుకున్నారని పేర్కొన్నారు. ఈ ఘట్టాన్ని దర్పణంపడుతూ తాల వృక్షాన్ని అగ్నికి ఆహుతి చేసి సురాపాళం ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవ మూర్తులకు ఆస్థానం నిర్వహించారు. స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ భద్రతా జమేదార్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న

కూటమి అనుకూలురుకే ఓటు హక్కు

- అనలైన రైతుల ఓట్లు గల్లంతు
- అధికారుల ఏకపక్ష నిర్ణయాలపై రైతుల ఆగ్రహం
- ఖాళీ పేపర్లలో సంతకాలతో ఓటరుగా పేర్కొన్న అధికారులు

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలు కూటమి నేతల కనుసన్నల్లో ఏకపక్షంగా జరిగాయి. ఇరిగేషన్ అధికారులు ఏకంగా ఓటరు జాబితాలనే తారుమారు చేసి కూటమి నేతలకు అనుకూలంగా జాబితాలు సిద్ధం చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా అధికారులు ఓటర్లు లేకుండానే ఖాళీ పేపర్లలో సంతకాలు పెట్టి ఓటరు జాబితాగా అందజేశారు. అధికార పార్టీ నేతలు ఇచ్చిన సర్వే నంబర్ల ఆధారంగా కూటమి అనుకూల వర్గీయులకు ఓటు హక్కు కల్పించడం వివాదాస్పదమైంది.

సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో 107 చిన్ననీటి పారుదల చెరువుల సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరిగాయి. ఇందులో దాదాపు 100 నీటి సంఘాలకు ఏకగ్రీవం కాగా మిగిలిన వాటికి పోటీ అనివార్యమైంది. ఎన్నికలు పూర్తిగా ఇరిగేషన్, పోలీస్, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో కూటమి నేతలకు అనుకూలంగా నిర్వహించారు. ఓటరు జాబితాలు సిద్ధం చేసే సమయంలో ప్రతి ఆయకట్టు సంఘం పరిధిలో కూటమి నేతల మద్దతుదారులు ఎన్నికల బరిలో నిలుస్తారో వారి పేర్లను మాత్రమే జాబితాలో ఉంచి ఇతర వర్గీయుల పేర్లను తొలగించారు. ఇలా ఏకపక్ష ఓటరు జాబితాలతో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన ఇరిగేషన్ శాఖ అధికారుల తీరుపై రైతులు మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా, పార్టీలకతీతంగా జరగాల్సిన ఎన్నికలను అప్రజాస్వామికంగా నిర్వహించి ఆ వ్యవస్థను అప్రతిష్ట పాలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



వరదయ్యపాళెం ఓట్లు లేక తర్జనభర్జన పడుతున్న రైతులు

ఓటరు జాబితా లేకుండానే ఎన్నికల నిర్వహణ

వరదయ్యపాళెం మండలంలోని పెద్ద పాండూరు చెరువు నీటి సంఘం ఎన్నికలు వివాదాస్పదంగా మారాయి. అప్పటికప్పుడు కూటమి నేతలు తెలిపిన మేరకు సిద్ధం చేసిన ఓటరు జాబితా ఆధారంగా ఎన్నికలు నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. ఇరిగేషన్ శాఖ అధికారులు మాత్రం ఏకంగా ఓటరు జాబితాలో పేర్లు లేకుండానే ఖాళీ పేపర్లపై ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు సంతకాలు చేసి ఇవ్వడం, ఆ ఖాళీ పేపర్ల జాబితాను పోలీస్ స్టేషన్ వద్ద ఉంచడం వివాదంగా మారింది. పెద్ద పాండూరు చెరువు పరిధిలో 750 ఎకరాల ఆయకట్టు ఉండగా యానాదివెట్టు గ్రామ పంచాయతీకి ఒకటి, వెంగారెడ్డికండ్రిగ గ్రామానికి 3, పెద్ద పాండూరు గ్రామానికి 2 టీసీలను కేటాయించారు. వెంగారెడ్డికండ్రిగ, యానాదివెట్టు టీసీలకు సంబంధించి అప్పటికప్పుడు సిద్ధం చేసిన జాబితాలో రైతుల ఓట్లు గల్లంతు చేశారు. పెద్ద పాండూరు ప్రాంతంలో కూటమి నేతల అనుకూల వర్గానికి మాత్రమే ఓటు హక్కు కల్పించడం గమనార్హం. అంతేకాక టీసీలలో నిలవాల్సిన వారికి మాత్రమే ఓటు హక్కు కల్పించడం సర్వత్రా విమర్శలకు దారితీసింది. ఓటు హక్కు కల్పించకపోవడంపై స్థానిక రైతులు ప్రశ్నించగా ఎన్నికల విధులకు వచ్చిన వారు వారిని బుజ్జగించే ప్రయత్నం చేశారు. ఇది పూర్తిగా ఇరిగేషన్ వారి తప్పిదమని, ఇందులో తమ తప్పు లేదని వారు తప్పించుకునే ప్రయత్నం చేశారు. రైతులు ప్రశ్నించినప్పటికీ కూటమి నేతలకు అనుకూలంగా ఎన్నికలను ముగింపజేశారు.





ఓటరు జాబితాలో పేర్లు లేకనే సంతకాలు చేసిన ఇరిగేషన్ అధికారులు, వరదయ్యపాళెం మండలం పులివల్లంలో మునిహారరెడ్డికి చైర్మన్‌గా నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి